వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 363
శనివారం | 31 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



8 లో..

## తిరందాస్ యాదగిరిని కలిసిన పద్మశాలీలు

పద్మశాలి ఉద్యోగులు, కులస్తులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చ



8లో..

## గణపతి మండపాలకు పోలీసుల షరతులు

నిర్వాహకులతో సీపీ సమావేశం



2లో

## పార్టీలు మారొచ్చు కానీ.. మాట మార్చొద్దు

శ్రీహరికి హితవు పలికిన దాస్యం

ప్రాజెక్టులపై కడియంకు పూర్తి అవగాహన ఉందంటూ కితాబు

## రెండు రోజులు దండిగా వానలు



### ఏడు జిల్లాలకు రెడ్ అలెర్ట్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాపాతం రికార్డయ్యింది. ఈ క్రమంలోనే వాతావరణశాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. మరో రెండు రోజులు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది.
– వరంగల్ వాయిస్, కాశిబుగ్గ

వివరాలు 2లో..

# నియో.. ఏమాయే..!




**రూ.1,340 కోట్లతో అంచనా**

**ఏరియా పరిధి 15.50 కి.మీ.**

**కాజీపేట నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు 21 స్టేషన్లు**

**2014 నుంచి ఊరిస్తున్న నియో మెట్రో రైల్**

**ఇప్పటికే పనులు ప్రారంభమైతే 2025లో పూర్తి**

**అడుగు ముందుకు పడని ప్రాజెక్ట్**

వరంగల్ మహా నగరంలో రోజు రోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏర్పాటు చేయాలనుకున్న నియో మెట్రో రైల్ ప్రతిపాదన అటకెక్కింది. నగర వాసుల కలల ప్రాజెక్టుగా 2014నుంచి ఊరించిన నియో మెట్రో రైల్ ప్రతిపాదనలు గత పాలకుల నిర్లక్ష్యంతో కాగితాలకే పరిమితమయ్యాయి. రూ.1,340 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టి 2025లో పూర్తి చేస్తామంటూ గొప్పగా ప్రకటించినా ఇంతవరకు అడుగు ముందుకు పడలేదు. ఈ ప్రాజెక్ట నిర్మాణ పనులను మహారాష్ట్ర మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అప్పగించగా వారు సర్వే చేసి డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి, కాకతీయ పట్టణాభి వృద్ధి సంస్థకు అందజేశారు. వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు భూ, ఆకాశ మార్గంలో 15.50 కిలో మీటర్లు ప్రయాణించే ఈ రైలుకు మొత్తం 21 స్టేషన్లు ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు రూపొందించారు. దీనిపై అప్పటి ప్రభుత్వం పెద్దగా స్పందించకపోవడంతో నియో మెట్రో రైల్ ప్రతిపాదన మూలకు పడింది. దీనిని గత పాలకులు ఎన్నికల ప్రచార అస్త్రంగానే వాడుకున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా నియో మెట్రో రైల్ ప్రాజెక్టును పట్టాలెక్కించాలని నగరవాసులు కోరుతున్నారు. – వరంగల్ వాయిస్, వరంగల్

# నియో.. ఏమాయే..!



**రూ.1,340కోట్లతో అంచనా**

**ఏరియా పరిధి 15.50 కి.మీ.**

**కాజీపేట నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు 21 స్టేషన్లు**

**2014నుంచి ఊరిస్తున్న నియో మెట్రో రైల్**

**ఇప్పటికే పనులు ప్రారంభమైతే 2025లో పూర్తి**

**అడుగు ముందుకు పడని ప్రాజెక్ట్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** విదేశాల్లో ఇప్పటికే విజయవంతంగా నడుస్తున్న మెట్రో నియో ప్రాజెక్టును వరంగల్ లాంటి టైర్-2 నగరాల్లోను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గత పాలకులు భావించారు. ప్రస్తుతం వరంగల్ మహానగర జనాభా పద కొండు లక్షలు కాగా మరో 20 ఏళ్లకు అంటే 2044కి నగర జనాభా 20నుంచి 30 లక్షల మధ్య ఉండే అవకాశం ఉంటుందని అంచనా. దీంతో మధ్య తరహా నగరమైన నాసిక్‌కు ప్రతిపాదించిన నియో మెట్రో విధానం వరంగల్ కు చక్కగా సరిపోతుందని భావించిన పాలకులు దీన్నే ప్రతిపాదించారు. ఈ మేరకు నిర్మాణ పనులను మహారాష్ట్ర మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ కు అప్పగించారు.

## ఎలక్ట్రిక్ బస్సులు.. రబ్బర్ టైర్లు..

నియో మెట్రో సాంకేతికతలో ఎలక్ట్రిక్ బస్సులను ఉపయోగిస్తారు. రబ్బర్ టైర్లపై నడవడం దీని ప్రత్యేకత. సాధారణ బస్సుల కంటే ఇవి చాలా పొడవుగా ఉంటాయి. చూసేందుకు మెట్రో రైలు కోచ్‌ల మాదిరిగానే ఉంటాయి. రెండు కోచ్‌లతోనూ బస్సులను నడిపించవచ్చు. మెట్రో రైళ్ల మాదిరిగానే 'ఆటోమేటెడ్ వ్యవస్థ' ద్వారా ఈ బస్సుల రాకపోకలను నియంత్రిస్తారు. ఈ బస్సుల్లో ఎయిర్ కండిషన్, ఆటోమేటెడ్ డోర్ క్లోజింగ్ సిస్టమ్, లెవెల్ బోర్డింగ్ సహా అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయి. సౌకర్యవంతమైన సీట్లు, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేతో కూడిన సమాచార వ్యవస్థ ఉంటుది. నియో మెట్రోకు అవసరమైన ఎలివేటెడ్ కారిడార్‌ను సింగిల్ పిల్లర్‌పైనే నిర్మించవచ్చు. రోడ్డు మధ్యలో ఇది కేవలం 2.2 మీటర్ల స్పేస్‌ను మాత్రమే ఆక్రమించుకుంటుంది. వరంగల్ రోడ్లు కొత్త మెట్రోకు సరిపోతాయని ఈ తరహా మెట్రోను ప్రతిపాదించారు. ఈ మార్గంలో మూడోవంతు ప్లాట్‌ఫాంలు షెడ్ల రూపంలోనే ఉండనున్నాయి. ఫలితంగా నిర్మాణ, విద్యుత్తు వ్యయం భారీగా ఆదా అవుతుంది. ఆటోమెటిక్ టికెటింగ్ విధానంతో నిర్వహణ ఖర్చు కూడా తగ్గుతుంది.

## ఏరియా 15.5కి.మీ..స్టేషన్లు 21

కాజీపేట నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు మొత్తం 15.50 కిలో మీటర్ల పరిధిలో నిర్మించనున్న నియో మెట్రో ప్రాజెక్టులకు రూ.1,341 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. రెండు రైల్వే స్టేషన్లతో కలుపుకొని మొత్తం 21 స్టేషన్లలో దీనికి హాల్టింగ్ ఇచ్చారు. 2014నుంచి ఊరిస్తున్న ఈ ప్రాజెక్టును 2025లో పూర్తి చేసేలా ప్రతిపాదనలు రూపొందించారు. కాజీపేట రైల్వే స్టేషన్, ఫాతిమా నగర్, నిట్, ఫారెస్ట్ ఆఫీస్, సుబేదారి, రోహిణి హాస్పిటల్, అదాలత్, నక్కలగుట్ట, అంబేద్కర్ జంక్షన్, పబ్లిక్ గార్డెన్ జంక్షన్, ప్రసూతి ఆసుపత్రి, హనుమకొండ చౌరస్తా, అలంకార్ సర్కిల్, ములుగు క్రాస్ రోడ్డు, కేఎంసీ, ఎంజీఎం, పోచమ్మ మైదాన్, ఎల్బీ నగర్, కాశిబుగ్గ, వెంకట్రామా టాకీస్ వీదుగా వరంగల్ రైల్వే స్టేషన్ వరకు మొత్తం 21 స్టేషన్లు ఉంటాయి. ఈ నియో మెట్రో ద్వారా శీఘ్రంగా గమ్యస్థానాలను చేరుకోవచ్చు.

## అటకెక్కిన ప్రాజెక్ట్..

మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణానికయ్యే వ్యయంలో కేవలం 20 నుంచి 25 శాతం ఖర్చుతో 'మెట్రో-నియో' ప్రాజెక్టును నిర్మించవచ్చు. అందుకే టైర్-2 నగరమైన వరంగల్ కు ఈ ప్రాజెక్ట్ ఉత్తమమైనదిగా భావించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎప్పుడు వరంగల్ వచ్చినా మెట్రో-నియో ప్రస్తావన లేకుండా తన ప్రసంగాన్ని ముగించేవారు కాదు. నగర ప్రజలకు ఈ ప్రాజెక్టును ఊరించి ఉసూరుమనిపించారు. అప్పుడు..ఇప్పుడు అంటూ ప్రచారాలతోనే పుణ్య కాలం గడిసి పోయింది. మహారాష్ట్ర మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ డీపీఆర్ లను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థకు అందజేసినా పాలకులు సైలెంట్ కావడంతో ప్రాజెక్ట్ కనుమరుగైంది. అయితే రాష్ట్రంలో నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా వరంగల్ మహా నగర ప్రజల అవసరాలను గుర్తించి మెట్రో-నియో ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# పార్టీలు మారొచ్చు కానీ.. మాట మార్చొద్దు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ హయంలోనే అత్యంత అవినీతి జరిగిందని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ శుక్రవారం దేవాదుల ప్రాజెక్టును సందర్శించిన కాంగ్రెస్ మంత్రుల బృందం ప్రాజెక్టుపై ఎటువంటి అధ్యయనం చేయకుండానే చిల్లర, మల్లర మాటలు మాట్లాడారని విమర్శించారు. సమైక్య రాష్ట్రంలో వ్యవసాయం దండగా అయితే కేసీఆర్ ప్రభుత్వంలో వ్యవసాయ పండుగలా చేశాడన్నారు. అనేక ప్రాజెక్టులు, చెరువుల్లో నీళ్లు నింపి ఆరున్నర లక్షల ఎకరాలకు దేవాదుల ద్వారా నీటిని అందించాడన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలోనూ, ప్రతి విషయంలోనూ తెలంగాణకు అన్యాయం జరిగిందని అప్పటి ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2008లో ప్రాజెక్టు అంచనా నాలుగువేల కోట్లు ఉంటే కాంగ్రెస్ హయాంలో 10 వేల కోట్లకు పెంచి అవినీతికి పాల్పడ్డారని ఎద్దేవా చేశారు. అప్పటి టీడీపీ, మొన్నటి బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ లో ఉన్న కడియం శ్రీహరి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అపర భగీరథుడని, 1.20కోట్ల ఎకరాలకు సాగునీటిని అందించిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందని పలుమార్లు ప్రకటించారన్నారు. అంతేకాకుండా రూ.2,100 కోట్లతో 2017 లో శంకుస్థాపన చేసి 2022లో పూర్తి చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. 100 టీఎంసీల నీటిని దేవాదులకు కేటాయించడం హర్షనీయమని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని కడియం శ్రీహరి అన్న వీడియోలను సభా ముఖంగా చూపించారు. ఉత్త మాటలు చెబుతున్న ఉత్తంకుమార్ రెడ్డి పక్కనే కడియం శ్రీహరి ఉన్నప్పటికీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టులపై అవగాహన ఉన్నటువంటి కడియం శ్రీహరి పార్టీలు మారొచ్చు కానీ, మాట మార్చవద్దని హితవు పలికారు. రైతన్నను రాజు చేయాలని చెప్పి ప్రపంచంలోనే అతిపెద్ద కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, అనేక సంక్షేమ పథకాలు రైతుల కోసం అందించినటువంటి ఘనత కేసీఆర్ కు దక్కుతుందన్నారు. రైతు వేదిక, రైతుబంధు, రైతు బీమా అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులను నియమించి రైతుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడ్డారని ఈ సందర్భంగా తెలిపారు. అమలు కానీ 420 హామీలు, ఆరు గ్యారెంటీలతో గద్దెనెక్కినటువంటి కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో అసహనం పెరిగిందని వారి ఎమ్మెల్యేలను ఎక్కడికి అక్కడ నిలదీస్తున్నారన్నారు. అందుకే ఒక నెల ఫోన్ టాంపరింగ్ అని, ఒక నెల మేడిగడ్డ అని, ఒక నెల దేవాదుల ప్రాజెక్టు అని డ్రామాలాడుతున్నారన్నారు. సకాలంలో రుణమాఫీ చేయక, సకాలంలో రైతు భరోసా ఇవ్వక ఎరువులు, విత్తనాలు కూడా సకాలంలో అందించనటువంటి దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపునేని నరేందర్ తదితరులు కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ జనార్దన్ గౌడ్, కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, హసన్ పర్తి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బండి రజనీ కుమార్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు నయీమ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, శ్రవణ్ కుమార్, విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యులు పోలేపల్లి రామ్మూర్తి, పదో డివిజన్ అధ్యక్షులు ఖలీల్, 29వ డివిజన్ అధ్యక్షులు సదాంత్, రవీందర్ రావు, వీరస్వామితోపాటు పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

# డబ్బులు ఢిల్లీకి.. అభివృద్ధి అమరావతికి

**బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, మనుమకొండ :** హైడ్రాతో హైడ్రామా క్రియేట్ చేసి హైలెవల్ కమిషన్ లు దండుకోవడమే రేవంత్ రెడ్డి లక్ష్యమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి మండిపడ్డారు. హైదారాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బ తియ్యాలని రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నాడని విమర్శించారు. ఆకస్మిక, అనాలోచిత కూల్చివేతలతో భయబ్రాంతులకు గురిచేసి రియల్ ఎస్టేట్ ను కుదేలు చేసి, పెట్టుబడులను అమరావతికి మళ్లించడమే రేవంత్ రెడ్డి లక్ష్యంగా కనబుడుతుందనే అనుమానం వ్యక్తం చేశారు. పేద ప్రజల ఇల్ల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, పేదల ఇల్లు కూల్చాలని ఏ చట్టం చెప్పిందని ప్రశ్నించారు. హైడ్రాకు ఉన్న చట్టబద్ధత ఏమిటి? మంత్రివర్గ ఆమోదం ఉందా, ప్రతిపక్షాలను, ప్రజా అభిప్రాయం తీసుకున్నారా అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే పట్టాలు ఇచ్చి, కాంగ్రెస్ ప్రభుత్వమే పర్మిషన్ లు ఇచ్చి ఇప్పుడు అదే కాంగ్రెస్ కూల్చివేస్తుందని ఎద్దేవా చేశారు. వరంగల్ పేదల ఇల్ల జోలికి వస్తే సహించం, అక్రమ కట్టడాలు, కబ్జా స్థలాలు రికవరి చెయ్యండి.. కానీ పేదల గూడు చెదరగొట్టొద్దన్నారు. హైడ్రా కు మేం వ్యతిరేఖం కాదు హైడ్రాతో చేస్తున్న హైడ్రామాకు పేదల ఇల్లు కూల్చడానికి మేం వ్యతిరేకమని స్పష్టం చేశారు. పేదల ఇళ్లను రాత్రికి రాత్రే కూలుస్తూ తమ సోదరుడికి, ఇతర బడాబాబులకు మాత్రం ముందస్తు నోటీసులు ఇస్తారా!? హైడ్రాకు మనిషికో రూల్ ఉంటధా? అని ప్రశ్నించారు. పేద ప్రజల ఇల్లు నోటీసులు ఇవ్వకుండా కూల్చి, రేవంత్ రెడ్డి సోదరుడికి మాత్రం నోటీసులు ఇచ్చి ఎందుకు కాలయాపన చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. జులై లో ఏర్పాటైన హైడ్రా నెల రోజుల్లోనే తెలంగాణ లో, హైద్రాబాద్ లో ఉన్న చెరువులను కుంటలను, ఆక్రమణలను సర్వే చేసిందా!? ఎటువంటి శాస్త్రీయమైన అధ్యయనం లేకుండా, నిపుణుల అభిప్రాయం తీసుకోకుండా, అసెంబ్లీ లో చర్చ లేదు, క్యాబినెట్ లో చర్చ లేకుండా కేవలం సంచలనం కోసం, బెదిరింపులకు గురి చెయ్యడానికి రాత్రికి రాత్రే పుట్టిన హైడ్రాను వాడుకుంటున్నారు. 10 ఏళ్లు 15 ఏళ్లు టీడీపీ మినహాయిస్తే 50 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే పాలించింది. ఈ నిర్మాణాలకు కాంగ్రెస్ ప్రభుత్వం కారణం కాదా? అన్నారు. పట్టా భూముల్లో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయితీరాజ్, మున్సిపల్ శాఖల సమన్వయంతో ఇంటి నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చి అదే ప్రభుత్వం రాత్రికి రాత్రే కూల్చేయడానికి మించిన తుగ్లక్ చర్య ఇంకోటి ఉంటుదా అని అన్నారు. కాంగ్రెస్ లో పి.జనార్ధన్ లాంటి నాయకులు పేద ప్రజల ఇళ్ల పట్టాల కోసం, ఇళ్ల కోసం కృషి చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇందిరమ్మ ఇల్లు కట్టించారు. కానీ, ఈ కాంగ్రెస్ సీఎం మాత్రం అన్ని ఇళ్లు కూలగొడుతున్నారు. ప్రజా సమస్యలను డైవర్ట్ చెయ్యడానికి, పెట్టుబడులు అమరావతికి తరలించడానికి ఈ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

## గణపతి నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

### వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** గణపతి నవరాత్రి ఉత్సవాలను మండల ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్ అన్నారు. ములుగు జిల్లా ఎస్పీ శబరిష్ ఆదేశాల మేరకు మండలంలోని గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీలకు ఎస్ఐ సతీష్ పలు సూచనలు చేశారు.ఈ మేరకు ఆయన శనివారం పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలోని గణేష్ మండపాల నిర్వహకులు ముందుగా గ్రామాల్లో ఏర్పాటు చేసే గణేష్ విగ్రహం ఎత్తుతో పాటు ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం చేసే తేదీ, ప్రదేశంతో కూడిన సమాచారాన్ని తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్ సైట్, https://policeportal.tspolice.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి తాము ఆన్ లైన్ ద్వారా అనుమతులు జారీచేస్తామని పేర్కొన్నారు . గణేష్ మండపాలను గ్రామాల్లో ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. గణేష్ మండపాల వద్ద లైటింగ్ నిమిత్తం విద్యుత్ శాఖ వారి అనుమతితోనే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు వారి వారి కమిటీ వివరాలతో పాటు మండపాల వద్ద పూర్తి బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపం వద్ద ఏర్పాటు చేయాలని కోరారు. వృద్ధులు, చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా తక్కువ శబ్దకాలుష్యంతో స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మండపాల వద్ద ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లుయితే తక్షణమే డయల్ 100గానీ,స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ సతీష్ కోరారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హైదరాబాద్ డా బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు పట్ల ముఖ్యమంత్రి ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. కాళోజీ కళాక్షేత్రం, నయీమ్ నగర్ బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిని ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంలో హనుమకొండకు చెందిన డా.తిరుణహరి శేషు ప్రభుత్వ పనితీరు, విధివిధానాల రూపకల్పనలో ఉన్న ముఖ్యాంశాలపై 34 ఆర్టికల్స్‌తో రాసిన "కృషివలుడు" పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేశారు.

## పోచమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠాపన



**వరంగల్ వాయిస్, సంగెం :** మండలంలోని కాట్రపల్లి గ్రామంలో శనివారం శ్రీ మహాలక్ష్మి పోచమ్మ గుడి, హనుమాన్ గుడిలో శ్రీ అభయాంజనేయ స్వామి, పోచమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. కాట్రపల్లి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికి గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం పూజారులు వేదమంత్రాల మధ్య ఆశీర్వచనాలు అందించి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలకు శాలువా కప్పి సత్కరించారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెరలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి




**వరంగల్ వాయిస్ మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని స్థానిక బీటీఆర్ నగర్ లోని వడ్డెర కాలనీలో 72వ సంచార జాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా వడ్డెర సంఘ జిల్లా అధ్యక్షుడు సంపంగి రామచంద్రు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుంజ హన్మంతు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి, ప్రభుత్వం వడ్డెరలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడిచిన దేశంలోని కొన్ని వర్గాల ప్రజలకు స్వేచ్ఛ లేదన్నారు. ఇంకా దేశంలో శ్రమ శక్తిని నమ్ముకొని జీవనం కొనసాగించేవారు అధికంగా ఉన్నారని, వారిలో వడ్డెర కులస్తులు అగ్ర భాగాన ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన, పాలకులు మరీనా వడ్డెర కులస్తులకు ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు మాకు అందడం లేదని, కేవలం మమ్మల్ని ఓటు బాంక్‌గా మాత్రమే వాడుకుంటున్నారని వాపోయారు. కేవలం పనిదొరికిన చోటికి వెళ్లి ఏళ్లుగా సంచార జీవనం సాగిస్తున్నామని, మాపై గతంలో ప్రభుత్వాలు 1965 సంవత్సరం వరకు కేసులు బనాయించేవారని,1967 సంవత్సరంలో ఆగస్టు 30న క్రిమినల్ యాక్ట్ ను ఎత్తివేశారని అప్పుడు మమ్ములను సంచార జాతుల గుర్తించారని, ఆ సందర్భంగా ఈరోజును గుర్తుచేసుకుంటూ జెండా ఆవిష్కరణ చేస్తున్నామని తెలిపారు. మాతో పాటు ఉన్న కొన్ని కులాలను ఎస్టీ చేర్చి వడ్డెరను బీసీ-ఏలో చేర్చారని, ఎస్టీలుగా చేర్చాలని ఎన్ని ఉద్యమాలు చేపట్టిన ఫలితం లేకపోయిందన్నారు. వడ్డెరల కులస్తులు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా చేయుతనందించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో మాకు రాజకీయంగా గ్రామ పంచాయతీ, మునిసిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలలో ప్రత్యేక రిజర్వేషన్ ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం వడ్డెరలకు గుట్టలపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పల్లపు రాందాసు, ఆలకుంట్ల శ్రీనివాస్, రాపోలు ఎల్లయ్య, ఆలకుంట్ల వెంకటమల్లు, మక్కల వెంకన్న, బండారి చిరంజీవి, ముద్దంగుల మల్లికాంబ, రావులు ఐలయ్య, సంపంగి రాజు, కొమ్మరాజుల వెంకటేష్, కులస్తులు పాల్గొన్నారు.

## గోడ పత్రిక ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, పరకాల :** అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పరకాల కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గోడ పత్రిక ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ 20204-25 సంవత్సరానికి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువు మానేసిన వారికి, ఉద్యోగులకు ఉన్నతమైన విద్యను అభ్యసించడానికి చాలా ఉపయోగకరమని వారు ఉద్యోగులు పదోన్నతి పొందుటకు, బడి మధ్యలో మానేసిన వారికి ఇది చక్కని అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. యువతీ యువకులకు, మహిళలకు, పురుషులకు విద్యను ఓపెన్ ద్వారా అందించడం జరుగుతుంది. ఒక్క సంవత్సరంలోనే పదో తరగతి చదువుకోవచ్చు,ఒక్క సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదువుకోవచ్చు, కేవలం ఇంటర్మీడియట్ లో ఐదు సబ్జెక్టులు మాత్రమే ఇవి అన్ని ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగాలకు అర్హతగా పరిగణిస్తారు. రెగ్యులర్ గా చదువు లేని వారికి ఇలాంటి అవకాశాలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చిలువేరు సురేందర్, సహచర ఉపాధ్యాయ బృందం పాల్గొని పాఠశాల ఉపాధ్యాయులు నాగయ్య ఏసీపీ చిత్రపటం గీసి వారికి బహూకరించారు. ఈ కార్యక్రమంలోదొమ్మాటి భద్రయ్య, ఎండీ దావూద్, పీడీ కరిత భాగ్యమ్మ, అరుణ, శ్రీనాథ్ స్వప్న, సంజీవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రావణమాసం చివరి శనివారం పూజలు



**వరంగల్ వాయిస్‌బీ రఘునాథపల్లి :** శ్రావణమాసం చివరి శనివారం కావడంతో రఘునాథపల్లి మండల కేంద్రంలోని శ్రీ మహాదేవ స్వామి దేవాలయ ప్రాంగణంలో భక్తులు, ప్రజలతో కిటకిటలాడింది. మహిళలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేసి మూడు సంవత్సరాలు పూర్తి కావడంతో ఆంజనేయ స్వామి విగ్రహ దాత బచ్చు భలేశ్వరి చిరంజీవి గుప్త దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో పూజారి పిండిపూలు శ్రీనివాస్ శర్మ అత్యంత భక్తిశ్రద్ధలతో ఆంజనేయ స్వామికి అర్చన చేసి భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై కుమార్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి నేత, గ్రామ ప్రముఖులు, వ్యాపారవేత్తలు వేద కుమార్ గుప్తా, బచ్చు శ్రీధర్ ప్రియాంక, బచ్చు శ్రీనివాస్ గుప్తా, బెల్దే శ్రీనివాస్ గుప్తా, గౌశంకర్ గుప్తా, లాగిశెట్టి లింగయ్య గుప్తా, పోకల పోషనాథం గుప్తా, కరుణాకర్, సంపత్, కోళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటితో నిండిన డ్రైనేజీలు, సీసీ రోడ్లు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలో శనివారం తెల్లవారుజాము నుంచి కురిసిన భారీ వర్షానికి తొర్రూరు పట్టణ కేంద్రంలోని వివిధ కాలనీలలో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు వర్షపు నీటితో నిండి పొంగిపోర్లాయి. డ్రైనేజీలో ఉన్నటువంటి చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు బయటికి కొట్టుకు రావడంతో దుర్గంధంతో వివిధ కాలనీలలో ఉన్న ప్రజలు అసహనాన్ని వ్యక్తం చేశారు. అదేవిధంగా పట్టణంలోని స్థానిక డీసీసీ బ్యాంకు వద్ద వరంగల్ నుంచి ఖమ్మంకు వెళ్లే జాతీయ రహదారిపై వర్షపు నీరు భారీగా నిల్వ ఉండడంతో ద్విచక్ర వాహనదారులకు, ఇతర భారీ వాహనాలకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని పలువురు వాహనదారులు తెలిపారు. ఈ సందర్భంగా తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన స్థానిక ప్రజలు సంయుక్తంగా మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే వివిధ



వార్డులలో ఉన్నటువంటి ఇండ్లలోకి వర్షపు నీరు రావడంతో కుంటలను, చెరువులను తలపించే విధంగా ఉన్నాయని తెలుపుతూ వార్డులలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షాలు పడ్డప్పుడు వర్షం నీరు వల్ల డ్రైనేజీ వ్యవస్థ మొత్తం మునిగిపోయి, అందులోని నీరు బయటికి పొంగిపోవడం వల్ల చెత్తా చెదారం, వ్యర్థ పదార్థాలు కొట్టుకోని రావడంతో విపరీతమైన దుర్వాసన వస్తుందన్నారు. దీనివల్ల వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ శాఖ అధికారులు వెంటనే స్పందించి మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి వివిధ కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థను, సీసీ రోడ్లను ఏర్పాటు చేసి వర్షం నీరు వెళ్లే విధంగా తగు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానిక ప్రజలు మున్సిపల్ శాఖ అధికారులను కోరారు.

# నిత్యావసరాల ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

## సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి




**వరంగల్ వాయిస్, కాజీపేట :** నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. శనివారం కాజీపేటలో మాలోతు శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగిన పార్టీ మండల సమితి సమావేశంలో కర్రె భిక్షపతి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ 2014 ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 100 రోజులలో నిత్యాసర వస్తున్న ధరలు నియంత్రిస్తామని, ప్రజలకు అందుబాటులో నిత్యావసర వస్తువుల ధరలు ఉంచుతామని చెప్పారని, కానీ గడిచిన పదేళ్లుగా ఆకాశాన్ని అంటే విధంగా ధరలు పెరిగి చుక్కల్ని చూపుతున్నాయన్నారు. మధ్య దళారులు రేట్లను ఇష్టం ఉన్నంత మేరకు పెంచుతూ పోతూ నిత్యావసర వస్తువులను బ్లాక్ మార్కెట్ తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు పెట్రోల్ రూ.74, గ్యాస్ రూ.440, డీజిల్ రూ.56 లోపు ఉండి, వంట నూనె ధరలు అందుబాటులో ఉండేవని, కానీ కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు అనుకూలంగా లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇచ్చి పేదలపై భారం మోపారన్నారు. రేషన్ కార్డులు అందక పెరిగిన జనాభా కనుగుణంగా ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వకపోవడం వల్ల పేదలు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. ధరల పెరుగుదలపై సెప్టెంబర్ 2న సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు హనుమకొండలోని అంబేద్కర్ కూడలి వద్ద సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరు కానున్నారని తెలిపారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే ఈ నిరసన ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునగాల భిక్షపతి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసమల్ల దీన, కొట్టేపాక రవి, కొట్టే వెంకటేష్, నాయకులు మంద సుమన్, స్వరూప, మనమ్మ, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# అరుణోదయ సాంస్కృతిక కౌన్సిల్‌ను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక నర్సంపేటలోని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో అరుణోదయ జనరల్ కౌన్సిల్ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు వేణు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు గోవర్ధన్ మాట్లాడుతూ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రజల కోసం, ప్రజాస్వామ్యం కోసం ఎన్నో రకాలుగా పేదల గాధలను గానం చేసి ప్రజలను ప్రజాస్వామ్యాన్ని చైతన్య పరచడంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య పనిచేయడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా కానూరి వెంకటేశ్వర్లు, రామారావు, పాణిగ్రహి, లాంటి ఎంతోమంది కవులు కళాకారులు ప్రజలను చైతన్యం చేయడంలో బుర్రకథలు, నాటకాలు, బాగోతం, వేసి దొరల నుంచి దోపిడి నురచి ఏ విధంగా ప్రజలు నష్టపోతున్నారనే విషయాన్ని పాటల రూపంలో వివరించారు. అరుణోదయ సాంస్కృతిక సమాక్య కౌన్సిల్ జయప్రదానికి ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా రాచర్ల బాలరాజు, కోశాధికారిగా ఎలకంటి రాజేందర్లతో పాటు 8మందితో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, పార్టీ జిల్లా నాయకులు బండి కోటీశ్వరులు, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పూలక్క, విద్యావంతుల డివిజన్ అధ్యక్షులు సామ్రాతి మల్లేశం, జక్కుల తిరుపతి, గట్టి కృష్ణ, గుర్రం అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణనలో కులగణన చేయాలి

## ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి అశోక్ ఓంకార్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సెప్టెంబర్ లో దేశ వ్యాప్తంగా జనగణన జరుగుతుందని ప్రచారం జరుగుతున్న సందర్భంలో తెలంగాణలో స్థానిక ఎన్నికలు జరుగుతాయని ప్రక్రియను ఎన్నికల కమిషన్ ప్రారంభించిన నేపథ్యంలో తెలంగాణలో కులగణన చేయకుండా స్థానిక ఎన్నికలు జరుపటం కాకుండా కుల గణన తరువాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. శనివారం ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం హైదరాబాద్ ఓంకార్ భవన్ లో ఎన్ రెడ్డి హంసా రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ ఇజ్రాయెల్ లెబనాన్ పై దాడులు చేస్తూ, పాలస్తీనాపై దాడులు చేస్తూ, ఇరాన్ ను రెచ్చగొట్టి అంతర్జాతీయ ఉద్రిక్తతలు పెంచి పోషించడానికి అమెరికా ఇతర సామ్రాజ్య వాద దేశాలతో కలిసి ఇజ్రాయెల్ సాగిస్తున్న దాడులు, యుద్ధోన్మాద చర్యలను ప్రపంచ శాంతి కాముకులు పూర్తిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజలు నరేంద్ర మోడీ మెజారిటీ తగ్గించిన కూడా పరిపాలనలో ఏ మాత్రం మార్పులు రావటం లేదని, ఇంకా అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలు అమలు చేస్తున్న తీరు, పేద ప్రజలపై కులం, మతం పేరుతో జరుగుతున్న దాడులు, మహిళపై జరుగుతున్న పైశాచిక దాడులు వాటి తీరుపై సమాజంలో ఆందోళన నెలకొందని, వీటికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు ఉధృతం కావాలని, అందుకు ఎంసీపీఐ(యూ) శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపు నిచ్చారు.

# సెప్టెంబర్ 10న రాష్ట్ర సదస్సు

## ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని, ప్రపంచంలో తెలంగాణ పేరు ప్రఖ్యాతులు గలిగిన ఈ పోరాటాన్ని ప్రపంచం ప్రజా ఉద్యమాలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దానిలో భాగంగా సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించాలని, సెప్టెంబర్ 10న ఓంకార్ భవన్ బియన్ హాల్ లో రాష్ట్ర స్థాయి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను పెద్ద ఎత్తున జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, వసుకుల మట్టయ్య, గోనె కుమారస్వామి, కుంభం సుకన్య, వడ్తియ తుకారాం నాయక్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు, అధ్యాపకులను వెంటనే నియమించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలోని మైనారిటీ గురుకుల పాఠశాలల కళాశాలలోని ఉపాధ్యాయ, అధ్యాపక ఖాళీలను తక్షణమే నియమించాలని కోరుతూ నేడు సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా కూడా ఇంతవరకు ఉపాధ్యాయ అధ్యాపక పోస్టులను భర్తీ చేయలేదని, వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గురుకుల పాఠశాలలో కళాశాలలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు లేక సబ్జెక్టుల వారీగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే గురుకుల పాఠశాల, కళాశాలలో మూడు నెలలైనా నియమించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా జిల్లా సంబంధిత అధికారులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నియమించే విధంగా కృషి చేయాలని వారు కోరారు. స్పందించిన జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి వెంటనే ఉపాధ్యాయ అధ్యాపక ఖాళీల భర్తీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగు శ్రావణ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆబోతు అశోక్, డోనికేని రమేష్ పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, పీహెచ్ సీ రాయపర్తి ఏరియా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. చౌటుపర్తి, చర్లపల్లి, నార్లపూర్ గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నందున మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు చికిత్స అందించారు. చౌటుపర్తి గ్రామంలో 98 మందికి, చర్లపల్లిలో 65 మంది, నార్లపూర్ లో 70, పరకాల మండలం కామారెడ్డిపల్లిలో 60 మంది క్యాంపునకు వచ్చి ట్రీట్ మెంట్ తీసుకున్నారు. వర్షాకాలం సీసన్ కాబట్టి దోమలు ఎక్కువ ఉన్నందున దోమలు కుట్టకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు కోరారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో కలసి గ్రామాల్లో గల పారిశుధ్య లోపాలు గుర్తించి వాటిని పరిష్కారం చేయడం జరిగింది. నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం, చెత్తను, మోరీలను శుభ్రం చేయించారు. అవసరం ఉన్న వారికి రక్త పరీక్షలు, బీపీ, షుగర్ టెస్ట్ లు చేసి మందులు పంపిణీ చేయడం జరిగింది. డాక్టర్లు అనూహ్య, వంశీ, అపర్ణ, మాధవి, హెచ్ఈఓ రాజకుమార్, సూపర్ వైజర్స్ సాంబయ్య, ప్రశాంతి, గ్రామ సెక్రటరీలు, సాంబ శివరావు, అరుణ్, మౌనిక, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# డాక్టర్ సత్య సిద్దార్థకు సూపర్ స్పెషాలిటీ కోర్సు పట్టా



**వరంగల్ వాయిస్, వాయిస్ ప్రతినిధి:** సూపర్ స్పెషాలిటీ సర్జికల్ అంకాలజీ ఎంసీహెచ్ కోర్సులో డాక్టర్ మామిడిపల్లి సత్య సిద్ధార్థ పట్టా అందుకున్నారు. లక్నోలో నిర్వహించిన కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ స్నాతకాత్సవంలో ఈ పట్టాను ఉత్తర ప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్ చేతుల మీదుగా అందుకున్నారు. డాక్టర్ మామిడిపల్లి సత్య సిద్ధార్థ న్యూఢిల్లీలో గల ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) నుంచి ఎంఎస్ జనరల్ సర్జరీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. నార్కెట్ పల్లిలోని కామినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి పొందారు. సత్య సిద్ధార్థ భార్య డాక్టర్ భావన కూడా వైద్య వృత్తిలో కొనసాగుతుంది. డా.భావన న్యూఢిల్లిలో జనరల్ మెడిసిన్, డీఎం కార్డియాలజీ చదివింది.

# రంగనాథ స్వామి దేవాలయంలో సీఐ ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని ప్రసిద్ధిగాంచిన అతి పురాతన కాకతీయ రాజులు నిర్మించిన శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో శ్రావణమాస చివరి శనివారం సందర్భాన్ని పురస్కరించుకొని స్వామివారికి పంచామృతాలతో అభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శనివారం స్థానిక ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓ మచ్చ శివకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథ స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మచ్చశివకుమార్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూర్ సురేష్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, దేవాలయ లీగల్ అడ్వైజర్ సాంబారు ప్రభాకర్, ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రామాచార్యులు, భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు గోషికొండ సుధాకర్, మౌటం శ్రీనివాస్, వంగరి సమ్మయ్య, రాగుల ప్రసాద్, మంచాల సుజన, కూరపాటి రోజా, గడ్డం భాస్కర్, భక్తులు చిమ్మని వేణు, దూడం చంద్రం, పల్లకొండ రాజమణి తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చంద మల్లయ్య ముడతనపెల్లి నవీన్ కుటుంబానికి సహాయంగా రూ.2000, దర్గా కాజీపేట పరపతి సంఘం నుంచి వలపదాసు రాజమల్లు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ ద్వారా రూ.1000 స్వయంగా వారు ఉండే స్మశాన వాటిక ఆవరణలోని గదికి వెళ్లి అందించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ వార్త తెలిసిన పద్మశాలి కులబాంధవులందరూ వారి వారి స్థాయిలను బట్టి సహాయం అందించాలని వారు కోరారు.

## అంకిత భావంతోనే ఉద్యోగికి గుర్తింపు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** అంకిత భావంతో విధులు నిర్వహించినప్పుడే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ శ్రీనివాస్ నాయక్ అన్నారు. డోర్నకల్ మండలం కన్నెగుండ్ల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందిన ముల్కలపల్లి విజయ సంఘయ్య( సంగమేశ్వర రావు)ను వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి పూల్సింగ్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు సంక బద్రి నారాయణ, కార్యదర్శి మిరియాల సతీష్ రెడ్డి హాజరై మాట్లాడారు. 1996 డీఎస్సీ ద్వారా టీచర్ వృత్తి చేపట్టిన సంఘయ్య 27 సంవత్సరాలు నిర్విరామంగా ఇదే మండలంలో అనేక పాఠశాలల్లో విధులు నిర్వహించి విద్యార్థులకు ఇంగ్లీష్ బోధన చేశారన్నారు. ఉపాధ్యాయుడి అంకీత భావ కృషికి విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండడమే అందుకు నిదర్శనమన్నారు. సర్వీసు మొత్తంలో అత్యంత తక్కువ సెలవులు ఉపయోగించిన ఉపాధ్యాయుడిగా అందరి మన్ననలు పొందిన వ్యక్తి అని ప్రశంసించారు. ఉన్నత విద్యా సేవ అంటే చిట్ట చివరి క్షణం వరకు తరగతి గదిలో బోధన చేయడమే ఆ విషయంలో 100 శాతం విజయం సాధించారని సభలో వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి లక్ష్మ, మానుకోట, వరంగల్, ఖమ్మంలోని వివిధ టీచర్ల సంఘాల నాయకులు, కాంప్లెక్స్ హెచ్ ఎంలు పాల్గొన్నారు.

## నాలుగో బెటాలియన్‌లో పలువురి ఉద్యోగ విరమణ



**వరంగల్ వాయిస్, మామునూరు :** నాలుగో బెటాలియన్ లో ఏఆర్ఎస్ఐలు గా విధులు నిర్వర్తించిన ఎస్.సుధాకర్, ఎస్.రాధాకృష్ణ పదవీ విరమణ సందర్భంగా శనివారం బెటాలియన్ కమాండెంట్ రామ్ ప్రకాష్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులను, వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమాండెంట్ ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఏఆర్ఎస్ఐలు ఎస్.సుధాకర్, ఎస్.రాధాకృష్ణ పోలీస్ డిపార్ట్ మెంట్ కు ఎంతో సేవ చేశారని, వారు చాలా క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించారని వారి సేవలను కొనియాడారు. వారు విధి నిర్వహణలో అనేక అవార్డులు, రివార్డులు పొందారని అన్నారు. అలాగే వారికి ఎలాంటి అవసరం వచ్చిన బెటాలియన్ తరపున తమ సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. పదవీ విరమణ అనంతరం వారు కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణ ప్రసాద్, రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు శోభన్, సర్వర్,పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, అశోక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పీఏసీఎస్ చైర్మన్‌ను పరామర్శించిన నాగుర్ల



**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల మండలం, సీతారాంపురం గ్రామానికి చెందిన మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లేల లింగమూర్తి తండ్రి నల్లెల్ల రాజయ్య పటేల్ అనారోగ్యంతో ఇటీవల మరణించగా వారి నివాసానికి వెళ్లి పీఏసీఎస్ చైర్మన్ లింగమూర్తిని, వారి అన్నదమ్ములు శ్రీనివాస్, తిరుపతిలను, కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చనిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. చిత్రపటానికి పూలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్, లాండే రాజు, నర్సింగరావు, పకిడే సాంబరావు, అల్లె చిరంజీవి, శ్రీనివాస్, కొమురయ్య, సంజీవయ్య, భాస్కర్, కుమార్, రాజు, నాగరాజు, శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గుల వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలి

### కలకోటి మహేందర్, మాదాసి సురేష్



**వరంగల్ వాయిస్, ములుగు రూరల్ :** మారుమూల ఏజెన్సీ ఆదివాసి గ్రామమైన బొగ్గుల వాగుపై హైలెవెల్ వంతెనను నిర్మించాలని ప్రముఖ న్యాయవాది అసైన్డ్ భూమి సమితి(ఏబీఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కలకోటి మహేందర్, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. శనివారం ఉధృతంగా ప్రవహిస్తున్న బొగ్గుల వాగును కలకోటి మహేందర్, మాదాసి సురేష్ లు సందర్శించగా వారికి స్థానికులు ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామమైన జగ్గన్నగూడెంకు చెందిన బొగ్గుల వాగుకు పోటెత్తిన వరదలకు గతంలో ఇద్దరు అక్కాచెల్లెళ్లు కూడా మరణించారు. అయిప్పటికీ పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు కలకోటి మహేందర్, మాదాసి సురేష్ మాట్లాడుతూ వర్షకాలంలో బొగ్గుల వాగు ఉధృతంగా ప్రవహించడంతో మిగతా గ్రామాలతో రాకపోకలు నిలిచిపోయి ఆదివాసి, గిరిజన జగ్గన్నగూడెం గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులతో పాటు, సీజనల్ జ్వరాల బారిన పడిన రోగులు, ఏమైనా అత్యవసర పరిస్థితి ఏర్పడిన సామాన్య ప్రజానీకం వర్షకాలంలో వాగును దాటలేక ఇబ్బందులు పడుతుంటే పాలకులకు కనబడడం లేదా అని మండిపడ్డారు. గిరిజన ఆదివాసి సామాజిక వర్గానికి చెందిన ధనసరి సీతక్క మంత్రిగా ఉండి కూడా ఇక్కడ హై లెవెల్ బ్రిడ్జి నిర్మించక పోవడం చోశనీయమని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఉన్నతాధికారులు దృష్టి సారించి వెంటనే బొగ్గుల వాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలని, లేనిపక్షంలో దళిత, సామాజిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గాంధర్ల సారక్క, గాంధర్ల సూరక్క, రాములు, సాంబయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

# మచ్చ లేని ఉద్యోగ జీవితం ఆదర్శం




**వరంగల్ వాయిస్, జనగామ :** ఏ రంగంలో పనిచేసినా మచ్చలేని ఉద్యోగ జీవితం అభినందనీయం, ఆదర్శం అని జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.స్వాతి అన్నారు. శనివారం జనగామ ఆర్టీసీ డిపో నుంచి పదవి విరమణ చేసిన సెక్యూరిటీ హెడ్ గార్డు రాంపెల్లి యాదగిరి, ఏడీసీలు- ఏ.సత్తయ్య, ఎం.తిరుపతయ్య, కే.నర్సోజీ, డ్రైవర్ ఉప్పలయ్య వీడ్కోలు అభినందన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. డిపో, కార్మికుల పక్షాన సిబ్బంది, వారి వారి బంధు మిత్రులు ఒక్కొక్కరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో మచ్చ లేకుండా పనిచేసి పదవీ విరమణ చేయడం అభినందనీయం, అంతేకాకుండా వారు ఇతరులకు ఆదర్శమని, నేడు పదవి విరమణ చేసిన ఐదుగురు ఉద్యోగులు అలాంటి కోవకు చెందిన వారు కావడం, వారి సేవలను గుర్తించి వారిని సన్మానించే అవకాశం తనకు లభించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రకృతి కూడా పరవశించి చిరు జల్లులతో ఆశీర్వదించి, శోభాయమానంగా జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ఠ అతిథిగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్ట్, సామాజిక సేవా సారథి లయన్ కన్న పరశురాములు మాట్లాడుతూ డిపో ప్రారంభం నుంచి కార్మికులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి డిపో అభివృద్ధికి కృషి చేశారని, పలు మార్లు అవార్డులు సాధించారని గుర్తు చేస్తూ అందులో ఈ రోజు పదవీ విరమణ చేస్తున్న వారూ ఉన్నారని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పాటిస్తున్న సాంప్రదాయం ప్రకారం పూర్వ ఉద్యోగి వీఎస్ఆర్ రెడ్డి పంపిన కేకులను పదవీ విరమణ చేసిన ఉద్యోగ దంపతులు కట్ చేసి పరస్పరం అభినందించుకున్నారు. డిపో ప్రాంగణంలో ఉన్న దేవాలయం అభివృద్ధి నిధికి యాదగిరి, నర్సోజీలు పది వేల రూపాయల చొప్పున విరాళం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ డి.హుసేన్, ఎంఎఫ్ అజయ్ కుమార్, ఏఎంఎఫ్ లు రవీందర్, ఎస్.రమేశ్, టీఐ-3 ముస్త్యాల ముత్తయ్య, ఇంకా బి. శ్రీనివాస్, ప్రతాప్, ఉపచారి, ఆర్.రాఘవరెడ్డి, రమేశ్ గౌడ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అకౌంటెంట్ ఎస్.రమేశ్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.బి.ఎన్. రాజు కార్యక్రమ వ్యాఖ్యతలుగా వ్యవహరించి, సన్మాన గ్రహీతలను సభకు పరిచయం చేసి రంజింప చేశారు.

# షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలి




### ఏఐపీకేఎస్ కార్యదర్శి చిర్ర సూరి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి షరతులు విధించకుండా రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణం మాఫీ చేసి, రైతాంగానికి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీపీఐ ఎంఎల్-మాస్ లైన్ (ప్రజాపంథా) పార్టీ అనుబంధ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) వరంగల్-హనుమకొండ జిల్లాల కార్యదర్శి చిర్ర సూరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో రైతాంగం రుణాలను మాఫీ చేసి, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వరంగల్ జాయింట్ కలెక్టర్ జి.సంధ్యారాణి, హనుమకొండ కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ ఏ. వెంకట్ రెడ్డిలకు ప్రతినిధి బృందంగా అందజేశారు. ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక రకరకాల ఆంక్షలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నదని అన్నారు. పట్టా బుక్ లేదని, రేషన్ కార్డు లేదని, అడంగల్ పహాని చెల్లదని, 2018 కంటే ముందు తీసుకున్నా రాదని రైతుల రుణమాఫీ చేయకుండా కొర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రకటనలు చేస్తూ, రైతులెవ్వరు ఇబ్బంది పడే పనిలేదని మొత్తం రుణమాఫీ చేస్తామని చెబుతున్నారని, కానీ బ్యాంక్ లో రుణాలు మాఫీ చేయక-కొత్త రుణాలు ఇవ్వక రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, బ్యాంకుల వద్ద , అగ్రికల్చర్ ఆఫీసుల వద్ద రైతులు పడిగాపులకు కాస్తున్నారని తెలిపారు. తక్షణమే గ్రామాలలో సమగ్ర సర్వే నిర్వహించి, బ్యాంకు రుణం తీసుకున్న ప్రతి పేద రైతుకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయాలని, వెంటనే కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం( ఏఐపీకేఎస్) వరంగల్-హనుమకొండ జిల్లా అధ్యక్షులు మైదంపాణి, జిల్లా నాయకులు అర్షం సుధాకర్, జి.రవి, ధార లింగన్న, జి.సుధాకర్, మోతే వీరారెడ్డి, లక్క సారంగపాణి, దిడ్డి కృష్ణ, సాగర్, పెండ్యాల జంపయ్య, పోగుల ఐలయ్య, రుద్రారపు ఆనంద్, పుత్తూరు రవి, కొత్తపల్లి రవి, సాబిరికాని మోహన్, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.




# ప్రజలే గద్దరన్న వారసులు

## గద్దర్ కుమారుడు గుమ్మడి సూర్య కిరణ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతదేశ పీడిత ప్రజల విముక్తి కోసం తుదివరకు పోరాడిన గద్దర్ అన్నకు నిజమైన వారసులు పీడిత ప్రజలేనని గద్దర్ కుమారుడు గుమ్మడి సూర్య కిరణ్ అన్నారు. గద్ధరన్న విగ్రహ ప్రతిష్టాపన కమిటీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు అధ్యక్షతన శనివారం హనుమకొండ జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ లో జరిగిన గద్దరన్న ప్రథమ వర్ధంతిలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పీడిత ప్రజల విముక్తి కోసం తుదివరకు త్యాగపూరిత పోరాటం చేసిన గద్దరన్న విగ్రహాలను, స్మృతి కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రజా పాలన కొనసాగిస్తామని చెప్పిన తెలంగాణ ప్రభుత్వంపై ఉందని అన్నారు. గద్ధరన్న స్ఫూర్తితో చెట్టు, పుట్టతో మమేకమై జీవిస్తున్న ఆదివాసీల రక్షణ కోసం, అణగారిన ప్రజల హక్కుల కోసం ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారుడు సంగంరెడ్డి పృధ్వీరాజ్ మాట్లాడుతూ భారతదేశ ప్రజలను, వారి కష్టాలను అర్థం చేసుకున్న మహా నాయకుడు గద్ధరన్న అని, పేద ప్రజలకు పెద్ద అండగానున్న గద్ధరన్న లేకపోవడం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. తెలంగాణ నలుమూలల్లో తన ఉద్యమ యాత్ర కొనసాగించిన గద్దర్ అన్న ప్రజలకు ఎక్కడ సమస్య ఉంటే అక్కడ ప్రత్యక్షమై దిక్కులేని ప్రజలకు పెద్ద దిక్కుగా నిలిచిన గుండెనిండా ప్రేమ కలిగిన మహా నాయకుడని అన్నారు. ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ పుట్టుక, చావు తనది బతుకంతా ప్రజల పక్షాన నిలబడి కలబడి పోరాటం చేసిన గద్దర్ చరిత్రను వివరంగా నమోదు చేసి ప్రజలకు అందివ్వాలన్నారు. వరంగల్ కేంద్రంగా జరిగిన ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్న గద్ధరన్న స్మృతి కోసం భాగంగా వరంగల్ లో రెండు ఎకరాల్లో గద్ధరన్న స్మృతి వనం, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వరంగల్ జిల్లా ఎమ్మెల్యే, మంత్రులకు విజ్ఞప్తి చేశారు. విముక్త చిరుతల కక్షి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ గద్దర్ అన్నను, గద్దర్ చరిత్రను చంపాలని, రూపుమాపాలని చూస్తున్నారని, ఏ పార్టీ కోసం ఆయన తన సర్వస్వాన్ని త్యాగం చేశాడో ఆ పార్టీ నేడు గద్దర్ అన్నను స్మరించుకోవడం లేదన్నారు. ఆల్ ఇండియా ఓబీసీ జాక్ నాయకులు సాయిని నరేందర్ మాట్లాడుతూ మార్క్స్, లెనిన్, మావో బాటలో నడిచిన గద్ధరన్న బుద్ధుడు, అంబేద్కర్ మార్గంలో విలువల సమాజ నిర్మాణంతో పాటు బహుజన రాజ్య స్థాపనకు కృషి చేశారని, ఆయన మార్గంలో అందరం నడవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గద్ధరన్న కోడలు సరిత, గద్ధరన్న సహచరుడు సీఎల్ యాదగిరి, వివిధ సంఘాల నాయకులు సుంకరి భిక్షపతి, పటేల్ వనజక్క, సోమ రామమూర్తి, సాయిని నరేందర్, నున్న అప్పారావు, తాడిశెట్టి క్రాంతి కుమార్, మచ్చ దేవేందర్, బండి మొగిలి, చింతకింది కుమారస్వామి, నలిగింటి చంద్రమౌళి, సాగర్, సింగారపు అరుణ, వెంగళ్ రెడ్డి, రాంబ్రహ్మం, మన్నె బాబురావు, గాజాల గోవర్ధన్, చుంచు రాజేందర్, దూడల సాంబయ్య, కేడేల ప్రసాద్, మదుపాక ఎల్లయ్య, ఇమాన్యుల్, అశోక్, ఐతం నగేష్, గడ్డం శరత్, రాజ్ మహ్మద్, సద్గుణ, నీలిమ, తెలంగాణ కొమురయ్య, బుంగ జ్యోతి, నర్సింగరావు, నేదునూరి రాజమౌళి, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, న్యాయవాదులు పులి సత్యనారాయణ, కూనూరు రంజిత్ గౌడ్, రాచకొండ ప్రవీణ్, గురిమిల్ల రాజు, కుమార్, చింత నిఖిల్ కుమార్, వెంకట్రాజం, ఎగ్గడి సుందర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

# అనగోని ధరణి ప్రియకు అభినందనల వెల్లువ

## నీట్ పీజీ ఎంట్రన్స్ ఫలితాల్లో సీటు



**వరంగల్ వాయిస్, హనుమకొడ :** ఇటీవల ప్రకటించిన నీట్ పీజీ ఎంట్రన్స్ ఫలితాల్లో సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అనగోని సదానందం గౌడ్ కుమార్తె డాక్టర్ ధరణి ప్రియ ర్యాంకు సాధించి పీజీ ఎంట్రెన్స్‌లో సీట్ సాధించింది. మాజీ జడ్పీటీసీ కీ.శే: అనగోని వెంకట్రాజం గౌడ్ మనవరాలు పీజీ ఎంట్రెన్స్‌లో సీట్ సాధించినందుకు గౌడ కులస్తులు ధరణి ప్రియను అభినందిస్తున్నారు. గౌడ జాతిలో పుట్టిన ఆణిముత్యంగా, కోహినూర్ వజ్రంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ లు అభివర్ణిస్తున్నారు. ప్రస్తుతం ధరణి ప్రియ యూపీఎస్సీ ద్వారా సెలెక్ట్ అయి ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ధరణి ప్రియను ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్‌లు అభినందించారు.

# వైభవంగా హనుమాన్ నగర సంకీర్తన



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని అతి పురాతనమైన ఆరు శతాబ్దాలు చరిత్ర గలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో శ్రావణమాస చివరి శనివారం పురస్కరించుకుని నేడు దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి ఆధ్వర్యంలో నగర సంకీర్తన గ్రామ పురవీధుల గుండా అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొదటి స్వామి దేవాలయంలో దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు వి.మణికంఠ ప్రత్యేక పూజలు చేశారు. పత్తిపాక హనుమాన్ భజన మండలి వారిచే శ్రావణమాసం పురస్కరించుకుని నెల రోజులపాటు వివిధ గ్రామాలలో నగర సంకీర్తన చేసుకుంటూ 29వ రోజు శాయంపేట గ్రామం చేరుకున్నారు. వారు భక్తి పాటలతో భజనలు చేస్తూ గ్రామ వీధుల గుండా తిరిగారు. ఈ కార్యక్రమంలో గిద్దమారి సురేష్, మాందాటి రాజు, తడుక సదానందం, నీల రంగారెడ్డి, అనుకారి శివ, అంకేశ్వరం మొగిలి, గజ్జి మహేందర్, చల్లా రవీందర్ రెడ్డి, పింగిలి రాంరెడ్డి, మాచర్ల వెంకటేష్, కుసుమ రమేష్, నాలిక వెంకటేష్, పొట్టకారి వికాస్, ముల్కనూర్ సంజయ్, తుడుం రమేష్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీల బతుకులు మారేది ఇంకెన్నడు?

## బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు

**వరంగల్ వాయిస్, ములుగు:** స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు గడిచిన వ్యవసాయ కూలీల బతుకులు మారేది ఇంకెన్నడని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలతో వ్యవసాయ కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయని, ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ములుగు జిల్లా కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం జిల్లా అధ్యక్షుడు ఇంజం కొమరయ్య అధ్యక్షతన జరగగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే సమగ్ర వ్యవసాయం కార్మిక చట్టాన్ని చేసి అమలు పరచాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పనులకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి సంవత్సరంలో 200 రోజులు పనులు కలిగించి రోజుకు 700 కూలీ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఏటా ఇస్తామన్న రూ.12 వేలు, మహిళలకు ఇస్తామన్నా నెలకు రూ.2500 వెంటనే అమలుపరచాలన్నారు. ఇండ్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఆరు లక్ష రూపాయలు అందించాలన్నారు. పోడు సాగు దారులందరికీ పట్టాలు ఇవ్వాలని, మాటలతోనే కాలయాపన చేయకుండా చేసిన వాగ్దానాలను తూచా తప్పకుండా అమలు జరపాలని లేనిచో ప్రజా ఉద్యమాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రసంగిస్తూ కష్ట జీవులైన వ్యవసాయ కార్మికులు ఐక్యంగా ఉండి డిమాండ్ల సాధనకై పోరాడేందుకు గ్రామ గ్రామాన సంఘాన్ని పటిష్టంగా నిర్మించుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎండీ అంజాద్ పాష, సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, సీపీఐ వెంకటాపూర్ మండల కార్యదర్శి బండి నర్సయ్య, వాసం రమేష్, కట్ల నరేష్, కుక్కల రవి, చిడం సమ్మయ్య, వట్టం సమ్మయ్య, బక్కన్నతదితరులు పాల్గొన్నారు.




# పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఏనుమాముల మార్కెట్ రోడ్డులోని ఇండియన్ ఆయిల్ ఆదిత్య సర్వీస్ స్టేషన్ పెట్రోల్ బంక్ ప్రారంభ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డితో 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ కలిసి రిబ్బన్ కట్ చేసి జనరేటర్ స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ కు, ముఖ్య అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెల్ది చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ విధానాన్ని ఉపయోగించుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పాఠశాల విద్యకు దూరమైన వారు, నిరుద్యోగులు, గృహిణులు, చదవాలని ఆసక్తి ఉన్నవారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఓపెన్ స్కూల్ విధానంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుకోవచ్చునని ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓఎస్ఎస్ కోఆర్డినేటర్ జీవి రామారావు వెల్లడించారు .సెప్టెంబర్ 10 వరకు అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు .పూర్తి వివరాలకు పాఠశాల అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఓఎస్ఎస్ భూక్యా బాలు సెల్ నెంబర్ 8464985471 సంప్రదించాలన్నారు.

# జర్నలిస్ట్ సిరిపురం తిరుపతిరెడ్డి కుటుంబానికి ఆర్థికసాయం



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** పట్టణానికి చెందిన సినీయర్ జర్నలిస్ట్, ఆంధ్రప్రభ సిటీ బ్యూరోగా పనిచేస్తూ, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిరిపురం తిరుపతిరెడ్డి కుటుంబానికి ఆంధ్రప్రభ వెల్ఫేర్ ట్రస్ట్ నుంచి రూ.1,51,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఆంధ్రప్రభ టీం శుక్రవారం దుగ్గొండి మండలం నాచినపల్లె గ్రామంలోని తిరుపతి రెడ్డి ఇంటికి వెళ్లి ఆంధ్రప్రభ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ రావు, బ్రాంచి మేనేజర్ జగపతిరావు, బ్యూరో ఇంచార్జి కృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆయన సతీమణికీ నగదు సహాయం అందించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలో స్టాఫ్ రిపోర్టర్లు మెండు రవీందర్, వీటీ.రాజు, ఆంధ్రప్రభ విలేకరులు శివశంకర్, ఆదర్శ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# మండపాలకు ఉచిత విద్యుత్ హర్షనీయం

## జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** రాష్ట్రవ్యాప్తంగా వినాయకుల మండపాలకు ఉచిత విద్యుత్తును అందిస్తున్న ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డికి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్ కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వాలు చేయని పనిని ఇప్పుడు కాంగ్రెస్ చేయడం శుభ పరిణామమన్నారు. ఉచిత కరెంటు కోసం వినాయక మండపాలకు దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి ఉచిత కరెంటు అందిస్తారని జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్ పేర్కొన్నారు.

# రిషబ్‌తో కలసి ఎన్టీఆర్ అడుగులు



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు నందమూరి తారక రామారావు, కన్నడ స్టార్ నటుడు, దర్శకుడు రిషబ్ షెట్టి ఒకే చోట కలిశారు. ప్రస్తుతం దేవర షూటింగ్ కంప్లీట్ చేసుకున్న తారక్ గాయం కారణంగా రెస్ట్ తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే గాయం నుంచి కోలుకోక ముందే అత్యవసర పనిమీదా మంగుళూరు వెళ్లినట్టు తెలుస్తుంది.తారక్ నేడు మంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో నడుచుకుంటూ వస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. అయితే తారక్‌తో పాటు ఎయిర్‌పోర్ట్‌లో ఇంకో స్టార్ నటుడు కూడా ఉన్నాడు. అతడే రిషబ్ షెట్టి. కాంతారతో నేషనల్ అవార్డు అందుకున్న ఈ నటుడు తారక్‌తో కలిసి ఎయిర్‌పోర్ట్‌లో వస్తున్నట్లు ఈ ఫొటోలు ఉన్నాయి. అయితే వీళ్లులట్ లో క్యాజువల్ గా కలిశారా లేక ఇద్దరూ కలిసే వెళ్లారా అనేది తెలియాల్సి ఉంది. ఇక వీళ్లిద్దరూ ఒకే ఫ్రేమ్ లో కనిపించడంతో అటు తారక్ ఫ్యాన్స్‌తో పాటు ఇటు రిషబ్ ఫ్యాన్స్ పండగా చేసుకుంటున్నారు. మరోవైపు ఎన్టీఆర్ తన అమ్మమ్మ ఊరు వెళుతున్నట్లు సమాచారం. తారక్ అమ్మమ్మ వాళ్ల ఊరు మంగుళూరు దగ్గరలోని కుందాపుర. రిషభ్ శెట్టిది కూడా అదే ఊరు. దీంతో ఈ ఇద్దరికి మంచి బాండ్ ఏర్పడింది. ఇదిలావుంటే తాజాగా కాంతారా ప్రీక్వెల్‌కు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. రిషబ్ షెట్టికి తారక్‌తో ఉన్న రిలేషన్‌షిప్ వలన కాంతార ప్రీక్వెల్‌లో ఎన్టీఆర్ అతిథి పాత్రల్లో నటించబోతున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# 2న గబ్బర్ సింగ్ రీరిలీజ్

పవన్ కల్యాణ్ – హరీశ్ శంకర్ కాంబోలో వచ్చిన సూపర్‌హిట్ మూవీ 'గబ్బర్ సింగ్' 2012లో విడుదలై పవన్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచి కలెక్షన్ల వర్షం కురిపించింది. తాజాగా ఈ చిత్రం మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. పవన్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 2న 'గబ్బర్ సింగ్' రీ–రిలీజ్ కానుంది. ఈనేపథ్యంలో దర్శకుడు హరీశ్ శంకర్, చిత్ర నిర్మాత బండ్ల గణేశ్ మీడియాతో ముచ్చటించారు. 'సోషల్‌మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందిన ఈరోజుల్లో 'గబ్బర్‌సింగ్' రిలీజ్ అయి ఉంటే ఎంత బాగుండేదో అని నా మనసులో ఎప్పటినుంచో ఒక చిన్న వెలితి ఉండేది. ఆ వెలితి ఇప్పుడు తీరింది. నాకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిన ఈ టీమ్‌కు ధన్యవాదాలు. 'గబ్బర్ సింగ్' అంటేనే ఒక చరిత్ర. అందులో ఎలాంటి సందేహం లేదు. మా జీవితాలను మార్చేసిన చిత్రమిది. ఈ సినిమా మేము ఊహించిన దానికంటే భారీ విజయాన్ని అందుకుంది. ఎక్కడికి వెళ్లినా అభిమానాన్ని చూపించారు. ఈ సక్సెస్ అందరికంటే బలంగా కోరుకున్న వ్యక్తి బండ్ల గణేశ్. ఈ సినిమా సక్సెస్ ఊహించిన తొలి వ్యక్తి పవన్‌కల్యాణ్. డబ్బింగ్ సమయంలోనే ఆయన ఇది పక్కా బ్లాక్‌బస్టర్ అన్నారు. ఇది ఎవర్‌గ్రీన్ మూవీ' అని హరీశ్ శంకర్ తెలిపారు. 'నా తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే. పవన్‌కల్యాణ్ నాకు బతుకునిచ్చారు. ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. నేను ఆర్థికంగా ఏ స్థాయికి వెళ్లినా పవన్ లేకపోతే ఈ పేరు, క్రేజ్ ఉండేది కాదు. 'చింతకాయల రవి' నుంచి నాకు హరీశ్‌తో సత్సంబంధాలు ఉండేవి. ఒకరోజు పవన్ నన్ను పిలిచి.. 'నేను సినిమా చేస్తా. నువ్వు నిర్మాతగా ఉంటావా అని అడిగారు'. నన్ను నిర్మాతగా చేసిన ఆయనకు పాదాభివందనం. 'గబ్బర్‌సింగ్' ఒక చరిత్ర. పవన్‌కల్యాణ్ అభిమానులకు ఈ సినిమా ఎంతో ప్రత్యేకమైనది. ఆయనతో 'తీన్‌మార్' చేశా. పవన్ గొప్ప మానవత్వం, నిజాయతీ, నిబద్ధత కలిగిన వ్యక్తి. నీతి పరుడు. దేశంలోనే అత్యధిక పారితోషికం అందుకుని, సంతోషంగా జీవితాన్ని కొనసాగించే నటుడు పవన్‌కల్యాణ్. జనం కోసం తన కుటుంబాన్ని వదిలేసి పోరాడుతున్నారు. దాదాపు 10ఏళ్లు ప్రజల కోసం పోరాడి ఈ రోజు ఒక స్థాయికి వచ్చారు. పవన్‌తో గబ్బర్‌సింగ్ చేయడం నా అదృష్టం. రీ రిలీజ్‌కు ఏడాది నుంచే ప్లాన్ చేస్తున్నా. గుజరాత్‌లో షూట్ చేస్తున్నప్పుడు పవన్ గుర్రంపై నుంచి కిందపడ్డారు. ఆరోజు నాకు గుండె ఆగిపోయింది. షూట్‌లో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. దర్శకుడు ఏం చెబితే ఆయన చేశారు. రీ రిలీజ్ టికెట్లు కోసం చాలామంది ఫోన్లు చేస్తున్నారు. తెలుగు సినీ



రంగానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వస్తున్న రోజులివి. దాదాపు ఏడేళ్ల నుంచి సినిమాలు నిర్మించకుండా ఉన్నందుకు బాధపడుతున్నా. ఇకపై బ్లాక్‌బస్టర్ సినిమాలు చేస్తా. సినిమాల్లో పుట్టా. సినిమాల్లోనే ఉంటా. సినిమానే నా వ్యాపకం, ఆశ, జీవితం. పరమేశ్వర ఆర్ట్స్ బండ్లగణేశ్ అంటే ఏంటో చూపించేందుకు బ్లాక్‌బస్టర్ చిత్రాలు నిర్మిస్తా. అదే సంకల్పంగా ముందుకు సాగుతా' అని బండ్ల గణేశ్ అన్నారు. సినిమా సక్సెస్‌ను ఊహించిన వ్యక్తి పవన్‌కల్యాన్‌గారు. మరో పుష్కర కాలం తర్వాత వచ్చినా ఈ సినిమా ట్రెండ్ ఇలాగే ఉంటుంది' అని అన్నారు.



# పనిచేసే చోట రక్షణ ఉండాల్సిందే

## 35 చిన్నకథకాదు.. పెద్ద సందేశం అంటున్న నివేదా



నివేదా థామస్ , విశ్వదేవ్ ఆర్, ప్రియదర్శి ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం '35 చిన్న కథ కాదు నందకిశోర్ ఇమాని దర్శకత్వం వహించారు. రానా నిర్మాత. తెలుగు, తమిళ్, మలయాళంలో సెప్టెంబర్ 6న విడుదల కానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా నివేదా మీడియాతో ముచ్చటించారు. '35 చిన్న కథ కాదు' చాలా సింపుల్ స్టోరీ. సరస్వతి పాత్రను పోషించాను. ఇలాంటి పాత్రలు చేయాలని నాకు మొదటి నుంచి ఆసక్తి. తెరపై మీరు నివేదాను చూడరు.. సరస్వతినే చూస్తారని నివేదా అన్నారు. ఇందులో విద్యావ్యవస్థ గురించి గొప్పగా చూపించారు. అలాగే చిన్నచిన్న ఆనందాలను చూపించారు. కరెంట్ పోయినప్పుడు క్యాండిల్ పెట్టుకొని అన్నం తినడం.. ఇలాంటి సన్నివేశాలు ఉన్నాయి. సాధారణంగా ఇలాంటి సీన్స్ మలయాళం చిత్రాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. అందుకే మలయాళం సినిమాలు వేరే భాషలో డబ్బింగ్ చేయడం కొంచెం కష్టం. ఈ సినిమా తిరుపతి నేపథ్యంలో సాగుతుంది. వెంకటేశ్వరస్వామి కూడా ఓ పాత్రలా చూపించాం. ఒక కుటుంబంలో ఉండే చిన్నచిన్న అపార్థాలు ఎక్కడికి దారితీశాయి అనేది కథ. అమ్మ తన ప్రేమతో ఆ కుటుంబాన్ని ఎలా తీర్చిదిద్దుకుంది అనేది సినిమా చూసి తెలుసుకోవాలి. కె.విశ్వనాథ్ చిత్రం చూసినట్లు ఉంటుంది. భార్యాభర్తల మధ్య బంధానికి అందరూ కనెక్ట్ అవుతారు. '35' అంటే మార్కులకు సంబంధించినదే ..అందరూ అదే అనుకుంటారు. కానీ, ఇది మార్కులతో పాటు పిల్లలకు సంబంధించినది. వాళ్లకు లెక్కల్లో వచ్చే మార్కుల చుట్టూ కథ తిరుగుతుంటుంది. పిల్లలు అడిగే కొన్ని ప్రశ్నలకు మనకు కూడా సమాధానం తెలియదు. మన దేశంలో 20 ఏళ్లు దాటిన అమ్మాయిని అడిగే మొదటి ప్రశ్న 'పెళ్లి ఎప్పుడు చేసుకుంటావ్?'. అలాంటప్పుడు నేను 20 ఏళ్లు దాటాక తల్లి పాత్ర పోషిస్తే తప్పేముంది. దీని ప్రభావం నా తర్వాత సినిమాలపై పడుతుందని ఆలోచించాను కానీ.. ప్రేక్షకులకు నేను అన్నిరకాల పాత్రలు చేస్తానని తెలియాలి కదా. ఈ పాత్రకు నివేదా మాత్రమే న్యాయం చేయగలదు అని దర్శకులు అనుకుంటే అది ప్రశంసతో సమానం. ఒకేతరహా పాత్రలు చేయాలని నేను అనుకోను. ప్రస్తుతం హేమ కమిటీ నివేదిక సంచలనం సృష్టిస్తోంది. నేను 'అమ్మ'లో ఓ సభ్యురాలిని. హేమ కమిటీ నివేదికలో వెలుగుచూసిన అంశాలు చాలా బాధాకరం. వాటి గురించి చాలా ఆలోచించాను.డబ్ల్యూసీసీని ఈ విషయంలో ప్రశంసించాలి. వాళ్ల చొరవ వల్లే ఇది సాధ్యమైంది. మహిళలకు పనిచేసే చోట భద్రత కల్పించడం కనీస అవసరం. దీని గురించి నేనూ రిక్వెస్ట్ చేశాను. ఎందుకంటే మనం ఇంట్లో ఎంత సమయం ఉంటున్నామో దానికంటే ఎక్కువ సమయం పని ప్రదేశాల్లో గడుపుతాం. అలాంటిచోట భద్రత అనేది అత్యవసరం అని నివేదా అన్నారు.

# టీవీ రంగంలోనూ లైంగిక వేధింపులు

## సీనియర్ నటి కుట్టిపద్మిని



తమిళ చిత్రసీమతోపాటు టీవీ రంగంలోనూ మహిళలపై లైంగిక వేధింపులకు కొదువలేదని సీనియర్ నటి కుట్టిపద్మిని ఆరోపించారు. ఓ తమిళ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. సినిమాల్లోనే కాదు టీవీ సీరియల్స్‌లో నటించే యువతులు కూడా లైంగిక వేధింపులకు గురవడం సహజంగా మారిపోయింది. అలా వేధింపులకు గురయ్యేవారు సమాజానికి భయపడి ఎవరికీ ఫిర్యాదు చేయడం లేదు. పారితోషికాలు పెద్ద మొత్తంలో లభిస్తుండటంతో కొంతమంది ఈ లైంగిక వేధింపులను భరిస్తున్నారు. ఫిర్యాదు చేసేవారికి మళ్ళీ సినిమాల్లో నటించే అవకాశాలు లభించడం లేదు. నటుడు సురేశ్ గోపీపై వస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఎక్కడున్నాయంటూ కొంతమంది అడుగుతున్నారు, ఆధారాలు ఎవరిస్తారు?' అని ఆమె ప్రశ్నించారు. దీనికి సీబీఐ విచారణ లాగా లై డిటెక్టర్లతో పరీక్షల చేయడం మినహా మరో మార్గం లేదన్నారు. దర్శకులు, సాంకేతిక నిపుణుల నుండి మహిళలు లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారని, అవి భరించలేక ఎంతోమంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని కుట్టి పద్మిని పేర్కొన్నారు.



# గణపతి మండపాలకు పోలీసుల షరతులు

## నిర్వాహకులతో సీపీ సమావేశం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పోలీసులు సూచించిన నిబంధనలను పాటిస్తూ భక్తి శ్రద్ధలతో గణపతి నవ రాత్రులను జరుపుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నిర్వాహకులకు సూచించారు. వినాయక చవితిని పురస్కరించుకొని గణపతి మండపాల నిర్వాహకులతో శనివారం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గణేష్ మండపాలు ఏర్పాటు చేసే వారు తప్పసరిగా పోలీసుల అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. ముందుగా నిర్వహకులు తాము ఏర్పాటు చేసే గణేపి ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్ సైట్ https://policeportal.tspolice.gov.in ద్వారా మండపాల నిర్వహకులు పూర్తి వివరాలను నమోదుచేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్ లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో లేదా స్థల యజమానితో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. గణేష్ మండపాల కొరకు విద్యుత్ శాఖ వారి అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలని సూచించారు. షార్ట్ సర్క్యూట్ జరుగకుండా నాణ్యత కలిగిన వైరును ఉపయోగించాలన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధులు, చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా తక్కువ శబ్దకాలుష్యంతో స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలని, సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలని, మండపాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ డీజేలను ఏర్పాటు చేయరాదన్నారు. గణేష్ ప్రతిమలు ఏర్పాటు చేసే షెడ్డును నాణ్యతతో ఏర్పాటు చేసుకోవాలని, గణేష్ మండపంలో 24 గంటలు ఒక వాలంటీర్ అందుబాటులో ఉండే విధంగా నిర్వహకులు తగు చర్యలు తీసుకోవాలి సూచించారు. గణేష్ మండపాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు వాలంటీర్లను నియమించుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా సమీపంలో రెండు బకెట్ల నీళ్ళు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట అడటం,లక్కీ డ్రాలు నిర్వహించడం, అసభ్యకరమైన నృత్యాల ఏర్పాటు చేయడం, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం, పాటలు పాడటంపై పూర్తిగా నిషేధం విధించినట్లు సీపీ ప్రకటించారు. ప్రతి మండపంలో విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో రాసి సంతకం చేస్తారన్నారు. మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లుయితే తక్షణమే డయల్ 100గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ నిర్వాహకులకు సూచించారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీ రవి, ఏసీపీలు జితేందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, తిరుమల్, నందిరాం నాయక్ తో పాటు స్పెషల్ బ్రాంచ్, స్థానిక ఇన్ స్పెక్టర్లు పాల్గొన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రానున్న రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. శనివారం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో వర్ష ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో వర్ష ప్రభావ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఆయా ప్రాంతాల్లో వర్ష ప్రభావాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు తహసీల్దార్ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్ ను నియమించాలన్నారు. కల్వర్టులు, లో లెవెల్ కాజ్ వేలు ఉన్నచోట్ల సిబ్బంది ఒకరిని నియమించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి వాటిల్లో నివసిస్తున్న వారిని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వేరే ప్రాంతానికి తరలించాలని సూచించారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేసి ప్రజలకు అందించాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్ లో 24 గంటల పాటు పనిచేసేవిధంగా కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వర్ష ప్రభావ పరిస్థితి గురించి కంట్రోల్ రూమ్ కు తెలియజేయాలన్నారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసే కంట్రోల్ రూమ్ ను వరంగల్ మహానగర పాలక సంస్థ కంట్రోల్ రూమ్ తో అనుసంధానం చేయాలన్నారు. భారీ వర్షాలు నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్, సాగునీటి పారుదల శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు అప్రపత్తంగా ఉండాలన్నారు. చెరువులు, కుంటల పరిస్థితిని సాగునీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వర్ష ప్రభావానికి సంబంధించిన సమాచారాన్ని సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు నివేదించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులతో పాటు, రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తిరందాస్ యాదగిరిని కలిసిన పద్మశాలీలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాస్ యాదగిరిని శనివారం సెక్రటేరియట్‌లో కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, వికారాబాద్ జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ బాల్నే సత్యనారాయణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పద్మశాలి ఉద్యోగుల సాధకబాధకాలు, కులస్తులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై వారు చర్చించారు. పద్మశాలీ సంఘం ఉద్యోగుల ఐక్యత కోసం ఆయనతో చర్చించారు. పద్మశాలీల సంఘటితంగా పనిచేయాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మన ఉద్యోగులకు ఎక్కడ సమస్యలు ఎదురైనా వాటిని తీర్చేందుకు ముందుంటానని తిరందాస్ యాదగిరి హామీ ఇచ్చారు.

# భద్రకాళి ట్యాంక్ బండ్ ఏరియా అభివృద్ధికి సహకరించాలి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** గత కొన్ని రోజులుగా భద్రకాళి ట్యాంక్ బండ్ ఏరియాలో ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి సహకరించాలని భద్రకాళి ట్యాంక్ బండ్ ఏరియా అభివృద్ధి సమితి అధ్యక్షులు మర్రి రవీందర్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని హైదరాబాదులోని ఆయన స్వగృమంలో కలిసి విన్నవించుకున్నారు. స్థానిక భద్రకాళి ట్యాంక్ బండ్ ఉన్న సమస్యలను ఆయనకు వివరించారు. 2018 జీవో 81 ద్వారా ఎల్పీసీ ఏర్పాటు చేయడమైనదని, భద్రకాళి ఫోర్ సోర్ బండ్ 30 మీటర్ల బఫర్ జోన్ ఫిక్స్ చేయాలని కోరారు. తక్షణమే స్పందించిన వేం నరేందర్ రెడ్డి ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డికి ఫోన్ చేసి తక్షణమే సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ మేరకు దగ్గరుండి మీ సమస్యలను పరిష్కరిస్తానంటూ వేం నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రకాళి ట్యాంక్ బండ్ ఏరియా అభివృద్ధి సభ్యులు కన్నోజు జలంధర్, వలబోజు శ్రీనాథ్ బాబు, శ్రీపతి శ్రీహరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ రచయిత, కాలమిస్ట్ సారంగపాణి అస్తమయం

## సాహితీ వేత్తల సంతాపం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రముఖ రచయిత, కాలమిస్ట్, సాహిత్య రత్న పరికిపండ్ల సారంగపాణి (78) ఎన్జీవోస్ కాలనీలోని తన స్వగృహంలో గుండెపోటుతో శనివారం ఉదయం నిద్రలోనే తుది శ్వాస విడిచారు. వృత్తిపరంగా హిందీ పండితుడిగా హిందీ సాహిత్యంలోనూ, ప్రవృత్తి పరంగా తెలుగు సాహిత్యం మీద మక్కువతో తెలుగు సాహిత్యంలోనూ ఎన్నో పుస్తకాలను, వ్యాసాలను రాసి కవిగా, రచయితగా, సాహితీవేత్తగా అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఉన్నత విద్యావంతుడైన సారంగపాణి ఎంఏ హిందీ, ఎంఏ హిస్టరీ, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంఎస్ కౌన్సిలింగ్ అండ్ సైకోథెరపీ, ఎంఈడి, ఎంఫిల్, ఎల్ఎల్ బి, పీజీ డిప్లమా ఇన్ ఎడ్యుకేషనల్ కౌన్సిలింగ్, పీజీ డిప్లమా ఇన్ పేరంటల్ ఎడ్యుకేషన్, పీజీ డిప్లమా ఇన్ ఫ్యామిలీ డిస్ ప్యూట్ రిజల్యూషన్, అమెరికా యూనివర్సిటీ నుండి బీపీఎన్ఐపీ డిగ్రీలు పొందారు. తాను పొందిన జ్ఞానాన్ని తెలుగు పాఠకలోకానికి అందించారు. పరీక్షల్లో విజయం సాధించాలంటే, మహనీయుల హితోక్తులు, మహనీయుల సత్యవాక్కులు, మహనీయుల మహితోక్తులు మొదలైన పుస్తకాలు విద్యార్థుల కోసం, పండంటి కాపురానికి 12 సూత్రాలు, జీవిత సత్యాలు మొదలైన పుస్తకాలు యువత కోసం, జీవించడం ఒక కళ, బతకడం కాదు–మనిషిగా జీవించాలి, పెన్షన్ జీవితంలో టెన్షన్ లేకుండా మొదలైన పుస్తకాలు వృద్ధుల కోసం రాయడమే కాకుండా, ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రతి గురువారం 'పరంజ్యోతి' శీర్షికన కాలమిస్టుగా అనేక ఆధ్యాత్మిక వ్యాసాలు, ఆంధ్రప్రభ దినపత్రికలో 'చింతన' ఆధ్యాత్మిక శీర్షికలో అనేక వ్యాసాలు, నవతెలంగాణ దినపత్రికలో 'సోపతి' కాలంలో అనేక అంశాలపై వ్యాసాలు రాయడమే కాకుండా జాగృతి, ఆంధ్రభూమి, సైకాలజీ టుడే మొదలైన పక్ష, మాసపత్రికల్లో కూడా హ్యూమన్ సైకాలజీపై వ్యాసాలు ఆయన కలం నుంచి జాలువారాయి. అంతే కాకుండా ఆకాశవాణి వరంగల్ కేంద్రం నుంచి వ్యక్తిత్వ వికాసంపై ఆయన చేసిన ప్రసంగాలు ప్రసారమయ్యాయి. ఆకాశవాణి ఢిల్లీ కేంద్రం నుంచి ప్రసారమైన అనేక హిందీ కార్యక్రమాలకు తెలుగు అనువాదం చేశారు. అనేకమంది విద్యార్థులలో రాజ్యభాష అయిన హిందీపై మక్కువ పెంచి హిందీ పరీక్షలు రాయించి హిందీ పండితులుగా జీవితంలో స్థిరపడేటట్లుగా కృషి చేశారు. ఇంతటి మహోన్నత రచయిత ఇకలేరు, ఒక కలం ఆగిపోయింది. తెలుగు సాహిత్యలోకం, ఒక ఆణిముత్యాన్ని, బాహుబషా కోవిధుడిని కోల్పోయిందంటూ పలువురు సాహితీ వేత్తలు కన్నీరు పెట్టుకున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com